సాక్షి
నిర్మల్
ఆదివారం । 11 । మే । 2025

గరిష్ఠం/కనిష్ఠం
37.5 /28.4

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత కూడా తగ్గుతుంది. సాయంత్రం జల్లులు కురిసే అవకాశం ఉంది.

అమ్మా వందనం..

తల్లులకు పిల్లలన్నా.. ఇల్లన్నా ఎంతో ప్రేమ. ఆ తల్లుల ప్రేమ ఇల్లు, పిల్లలకే పరిమితం కాలేదు. దేశాన్నీ ప్రేమించారు. మాతృభూమిపై మమకారంతో దేశ సేవ కోసం పిల్లలకు ఉగ్గుపాల నుంచే దేశభక్తిని నూరిపోశారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎందరో తల్లులు తమ పిల్లలను దేశ రక్షణ కోసం పంపించారు.మదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

10లో▸



న్యూస్‌రీల్

జిల్లా వైద్యుడికి రాష్ట్రస్థాయి పురస్కారం



పురస్కారం స్వీకరిస్తున్న డాక్టర్ శశికాంత్

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ నాలం శశికాంత్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం లభించింది. జిల్లాలోని పలుప్రాంతాలలో అందిస్తున్న వైద్యసేవలను గుర్తించిన విస్సా హెల్త్ సంస్థ రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం ప్రకటించింది శుక్రవారం రాత్రి హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క చేతుల మీదుగా పురస్కారం, ప్రశంసా పత్రం అందుకున్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయం కోసం పూజలు చేయండి

భైంసాటౌన్: పాకిస్తాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో భారత సైన్యానికి మరింత శక్తి ఇవ్వాలని, ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని పూజలు చేయాలని ముథోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలోని అన్నిచోట్ల కులమతాలకతీతంగా భారతీయులంతా కలిసి ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రార్థనలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకతీతంగా భారతీయులంతా ఐక్యతను చాటాలని కోరారు. పట్టణంలోని గట్టు మైసమ్మ అమ్మవారి ఆలయంలో తాను పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్యారం ఆడుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

నర్సాపూర్(జి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని డీఈవో రామారావు అన్నారు. నర్సాపూర్ (జి)మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్వహిస్తున్న యంగ్ ఇండియా సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్‌ను శనివారం సందర్శించారు. విద్యార్థులు ఆడిన క్రీడలను పరిశీలించారు. వారితో కలిసి అల్పాహారం చేశారు. డీఈవో వెంట ఇన్‌చార్జి హెచ్‌ఎం పురుషోత్తం, పీడీ దేవేందర్, ఉపాధ్యాయులు భూమేశ్వర్, పీఈటీ సుధాకర్ తదితరులు ఉన్నారు.

అమర జవాన్‌కు నివాళి




నివాళులర్పిస్తున్న పట్టణ వాసులు

నిర్మల్‌చైన్‌గేట్: భారత్–పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్‌కు జిల్లా కేంద్రంలోని నారాయణరెడ్డి మార్కెట్లో శనివారం వ్యాపారులు, ప్రజలు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మురళీనాయక్ ఫొటోతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జైజవాన్ అంటూ నినాదాలు చేశారు. చౌరస్తాలో రెండు నిమిషాలు మౌనం పాటించారు.

వీరమాతలు..

- తల్లి భారతి సేవలో తనయులు
- దేశం కోసం పంపిన తల్లులు
- నేడు మాతృదినోత్సవం

వందల కిలోమీటర్ల దూరం.. రోజులో ఒక్కసారి కూడా మాట్లాడలేని పరిస్థితులు.. ఏడాదికోసారే చూసుకోవాల్సిన విధుల్లో.. తమ కొడుకులు ఉన్నా.. ఆ కన్నపేగులు గర్వంగా భావిస్తున్నాయి. తమ కడుపున పుట్టిన బిడ్డలు మన గడ్డ రక్షణ కోసమే అంటూ గర్విస్తున్నారు. తల్లిభారతి సేవ కోసం తమ నూనూగు మీసాల తనయులను పంపిన ఈ తల్లులు నిజంగా వీరమాతలే. 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభమైన నుంచి దేశం మొత్తం సైన్యం వైపు చూస్తోంది. కవ్విస్తూ, కాలుదువ్వుతున్న శత్రుదేశాన్ని కకావికలం చేస్తున్న వీరసైనికులను చూసి గర్విస్తోంది. మాతృదినోత్సవం సందర్భంగా వీరులను కన్న తల్లులపై ప్రత్యేక కథనం. – నిర్మల్



ఒక్క కొడుకూ ఆర్మీలోనే..



నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన రాంలలిత భర్త మల్లేశ్ అనారోగ్యంతో మృతిచెందారు. ఈ దంపతులకు ఇద్దరు బిడ్డలు, ఒక కుమారుడు. రెక్కలకష్టంతో ఇద్దరు బిడ్డల పెళ్లిళ్లు చేశారు. ఒక్కగానొక్క కుమారుడినీ దేశసేవ కోసం పంపించారు. లలిత, మల్లేశ్ దంపతుల కుమారుడు కార్తీక్ ప్రసుతం ఇండియన్ ఆర్మీలో పనిచేస్తున్నాడు. కొడుకు తనవద్ద లేకున్నా.. కోట్లాదిమంది రక్షణలో భాగస్వామిగా ఉన్నాడని లలిత గర్వంగా చెబుతోంది. తల్లిగా కాస్త బాధ ఉన్నా.. ఎంతోమంది తల్లుల కోసం తాను పనిచేస్తున్నాడన్నది సంతోషాన్నిస్తోందంటున్నారు.

ముగ్గురు అక్కాచెల్లెళ్ల కొడుకులు..



సారంగపూర్ మండలం తాండ్రకు చెందిన సుగంధి, సుశీల, చంద్రకళ, రాజమణి అక్కాచెల్లెళ్లు. ఇందులో సుశీల చిన్నకుమారుడు సంతోష్, చంద్రకళ పెద్ద కొడుకు ప్రవీణ్, రాజమణి పెద్దకుమారుడు శ్రీకాంత్ సైన్యంలో ఉన్నారు. ఈ గ్రామం నుంచి పలువురు సైన్యంలో పనిచేస్తున్నా.. ఈ ముగ్గురు అక్కాచెల్లెళ్ల కుమారులు ముగ్గురూ దేశరక్షణలో ఉండటం విశేషం. కశ్మీర్ వంటి సమస్యాత్మక ప్రాంతంలోనే విధులు నిర్వర్తించడం గమనార్హం. తమ పిల్లలు ఒకరి తర్వాత ఒకరు సైన్యంలో చేరారని, వారు దేశం కోసం పనిచేయడం తమకు గర్వంగా ఉందని ఈ ముగ్గురు అక్కాచెల్లెళ్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఆపరేషన్ సిందూర్, యుద్ధవాతావరణ నేపథ్యంలో ఎప్పుడు వీలుంటే అప్పుడు తమ బిడ్డలతో మాట్లాడుతున్నామంటున్నారు.

ఆర్మీలో ఒకరు.. నేవీలో మరొకరు..



నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన శోభారాణి, సుకుమార్ దంపతులకు అమృత్‌తో పాటు వికాస్, విహార్ కవల పిల్లలు. అమృత్ ఆర్మీలో పనిచేస్తుండగా, వికాస్ నేవీలో దేశానికి సేవలందిస్తున్నాడు. ఒకరి తర్వాత ఒకరు ఇద్దరు కొడుకులు దేశరక్షణ విధుల్లో చేరడం, ఎంతటి విపత్కర పరిస్థితులు ఉన్నా.. దేశమే తమకు ముందు అని వారు చెబుతుండటం తల్లిగా చాలా గర్వంగా ఉంటుందని శోభారాణి చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మన సైనికులకు అండగా నిలువాలని, దేశం కోసం అందరం పాటుపడాలని అంటున్నారు.

ఉద్యాన రైతులకు ఊతం..!

- పండ్ల తోటలు, కూరగాయల సాగుకు ప్రోత్సాహం
- ఉద్యానశాఖ ప్రణాళిక సిద్ధం



చందారంలో తీగజాతి కూరగాయల సాగు

మామడ: పండ్ల తోటలు, కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు 2025–26 కోసం ఉద్యాన శాఖ ద్వారా సమగ్ర ప్రణాళికను రూపొందించింది. సమీకృత అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, నేషనల్ మిషన్ ఆఫ్ ఎడిబుల్ ఆయిల్స్, జాతీయ వెదురు మిషన్ నిధులతో జిల్లాలో 250 ఎకరాల్లో పండ్ల తోటల సాగును ప్రోత్సహించేందుకు అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రాయితీలు, పరికరాల సబ్సిడీలతో రైతుల ఆర్థిక భారం తగ్గించి, ఉద్యాన రంగంలో ఉత్పాదకతను పెంచడమే లక్ష్యం.

పండ్ల తోటలకు సబ్సిడీ..

సమీకృత అభివృద్ధి మిషన్ ద్వారా మామిడి, నిమ్మ, జామ, బత్తాయి తోటల సాగుకు హెక్టారుకు రూ.48 వేలు నాలుగేళ్లలో అందిస్తారు. డ్రాగన్ ఫ్రూట్, అరటి, బొప్పాయి సాగుకు ఎకరానికి రూ.7,200 సబ్సిడీ ఉంటుంది. ప్లాస్టిక్ మల్చింగ్, నీటి కుంటలు, వర్మీ కంపోస్ట్ యూనిట్‌లకు 50% రాయితీ, 70 కిలోల సామర్థ్యం గల సోలార్ క్రాప్ డ్రైయర్(రూ.2.50 లక్షలు)కు 40% రాయితీతో రూ.లక్షకు అందుబాటులో ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 55% రాయితీ అందిస్తారు.

కూరగాయల సాగుకు ప్రోత్సాహం

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద దొండ, కాకర, బీర, సొరకాయ వంటి తీగజాతి కూరగాయల సాగుకు పందిళ్ల నిర్మాణానికి ఎకరానికి రూ.లక్ష సబ్సిడీ ఇస్తారు. బిందు, తుంపర సేద్య పరికరాలకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100%, సన్నకారు రైతులకు 90%, 5 ఎకరాలకు పైగా భూమి ఉన్నవారికి 80% రాయితీ ఉంటుంది. వెదురు సాగుకు ఎకరానికి రూ.24,000 అందిస్తారు.

ఆయిల్‌పామ్ సాగుకు..

ఆయిల్‌పామ్ సాగుకు 90% సబ్సిడీతోపాటు, తోటల సంరక్షణ, అంతర పంటల సాగుకు ఎకరానికి రూ.2,100 చొప్పున నాలుగేళ్లపాటు అందిస్తారు. ఈ చర్యలు రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు, ఉద్యాన రంగంలో స్థిరత్వాన్ని సాధిస్తాయి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..



పండ్ల తోటలు, కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా సాగు కు ముందుకు వచ్చే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఈ యేడాది జిల్లాలో ఉద్యానసాగును పెంచేందుకు రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– బీవీ.రమణ, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

- జానకి షర్మిల



పోలీస్ అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: పోలీసులు సమయపాలన పాటిస్తూ.. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల సిబ్బందితో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ సిబ్బంది డ్యూటీలపై రివ్యూ చేశారు. పోలీసులు క్రమశిక్షణతో అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ.. తమకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. విధుల పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నీతి నిజాయితీతో పనిచేసే వారికి పోలీస్ శాఖలో ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ప్రజలు, గ్రామ పెద్దలతో సత్సంబంధాలు పెట్టుకుని గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాల సమాచారం సేకరించాలని తెలిపారు. ఇందులో ఏఎస్పీలు అవినాష్‌కుమార్, రాజేశ్‌మీనా, అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే.. ఓనర్లపై కేసు

- నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా



మైనర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఏఎస్పీ రాజేశ్‌మీనా

నిర్మల్‌టౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే ఓనర్లపై కేసు నమోదు చేస్తామని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా తెలిపారు. జిల్లా కేంద్రంలో మైనర్ డ్రైవింగ్‌పై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 10 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. దానికి పూర్తి బాధ్యత యజమానులు వహించాల్సి ఉంటుందన్నారు. పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ఉండడంతో తల్లిదండ్రులు పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై, వాహన యజమానులపై చట్టప్రకారం కేసును నమోదు చేయడం జరుగుతుందన్నారు. కొద్దిరోజులుగా మైనర్ పిల్లలు ద్విచక్ర వాహనాలు నడుపుతూ.. పోలీస్ తనిఖీల్లో పట్టుబడుతున్నారని తెలిపారు. పట్టుబడిన వారికి జరిమానాలు విధిస్తూ.. కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. కేసులు నమోదు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొంటారని సూచించారు. పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వడం వలన ఆ జాగ్రత్తగా అతివేగంతో వాహనాలు నడుపుతూ.. ప్రమాదాలకు కారణం అవుతారని తెలిపారు. ఏఎస్పీ వెంట పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

యువ వికాసానికి సిబిల్ అడ్డంకి

- రుణాల మంజూరుకు ఆర్బీఐ నిబంధన
- మార్గదర్శకాలు పాటిస్తామంటున్న బ్యాంకర్లు
- ఆందోళనలో దరఖాస్తుదారులు



ఇటీవల బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: నిరుద్యోగులకు స్వయం ఉపాధివైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం ప్రారంభించింది. ఈ పథకం కింద స్వయం ఉపాధి పొందేలా రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు రూ.6 వేల కోట్లు కేటాయించింది. దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా అర్హులను ఎంపిక చేసి రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. అయితే రూ.50 వేలకు మించి రుణాలకు ఆర్బీఐ సిబిల్ స్కోర్ నిబంధన అడ్డంకిగా మారింది. దీంతో రుణాల మంజూరులో అనిశ్చితి నెలకొంది.

కార్పొరేషన్	దరఖాస్తులు	మంజూరైన యూనిట్లు	రాయితీ	నిధులు కోట్లలో
ఎస్సీ	7,350	2,894	39	96
ఎస్టీ	3,627	2,325	25	35
బీసీ	17,286	3,876	41	00
ఏంబీసీ/ఈబీసీ	923	842	8.90	00
మైనార్టీ	5,926	1,045	17	41
క్రిస్టియన్	65	27	0	42

పెద్ద ఎత్తున దరఖాస్తులు

ఈ పథకం కోసం జిల్లా యువత నుంచి 35,177 దరఖాస్తులు వచ్చాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాల నుంచి వచ్చిన ఈ దరఖాస్తులను ఎంపీడీవోలు ఆన్‌లైన్‌లో పరిశీలించి, అర్హుల దరఖాస్తులను బ్యాంకులకు పంపారు. బ్యాంకులు సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలు మంజూరు చేస్తాయి.

రుణాల మంజూరు విధానం

పథకం కింద రూ.2 నుంచి రూ.4 లక్షల వ్యయం ఉన్న యూనిట్లకు 30%, రూ.1 నుంచి రూ.2 లక్షల యూనిట్లకు 20%, రూ.50 వేల నుంచి రూ.లక్ష వ్యయం ఉన్న యూనిట్లకు 10% రాయితీ ఇస్తారు. రూ.50 వేల లోపు అయితే రుణం పూర్తిగా రాయితీ ఉంటుంది. అయితే రూ.50 వేలకుపైగా మంజూరు చేసే రుణాలకు సిబిల్ స్కోర్ తప్పనిసరని బ్యాంకర్లు తెలిపారు.

మారిన ఆర్బీఐ నిబంధనలు

గతంలో పేదలకు రుణాలు సులభంగా అందేవి. ప్రస్తుతం రూ.50 వేలు దాటితే పాన్ కార్డ్, సిబిల్ స్కోర్ తప్పనిసరి. దీంతో యువతలో రుణాలపై అనుమానాలు చోటు చేసుకున్నాయి.

రిజర్వ్ బ్యాంక్ గైడ్‌లైన్స్ ప్రకారమే..

వివిధ రకాల రుణ మంజూరులో బ్యాంకులు తప్పనిసరిగా రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా గైడ్‌లైన్స్ పాటించాల్సి ఉంటుంది. రాజీవ్ యువ వికాసం పథకం కింద ఇచ్చే రుణాలకు సంబంధించి సిబిల్ స్కోర్‌ను పరిగణలోకి తీసుకోవద్దనే గైడ్‌లైన్స్ ఏమీ మాకు రాలేదు. అర్హులందరికీ నిబంధనల మేరకు రుణాలు మంజూరు చేస్తాం.

– బి.రాంగోపాల్, లీడ్ బ్యాంకు మేనేజర్

పేపర్ మిల్లును సందర్శించిన రైతులు



నర్సరీలో వివరాలు తెలుసుకుంటున్న రైతులు

దస్తురాబాద్: మండల కేంద్రానికి చెందిన రైతులు శనివారం సిర్పూర్ పేపర్ మిల్లును సందర్శించారు. పేపర్ తయారు విధానాన్ని, పేపర్ తయారీకి వినియోగించే నీలగిరి, సరుగుడు మొక్కల నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నర్సరీ నిర్వాహకులు మాట్లాడారు. పేపర్‌కు అవసరమైన నీలగిరి, సరుగుడు మొక్కలు రైతులకు అందిస్తామని తెలిపారు. నీలగిరిలో 25 రకాల మొక్కల పెంపకం చేసి రైతుల భూమిని పరిశీలించి మొక్కలు అందిస్తామని పేర్కొన్నారు. మూడేళ్లకు పంట చేతికి వస్తుందని తెలిపారు.

రాజీవ్ యువవికాస్ దరఖాస్తులు అందించాలి

నిర్మల్‌టౌన్: రాజీవ్ యువ వికాస్ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు ఈనెల 11 సాయంత్రం 5:30 గంటల వరకు వాటిని మున్సిపల్ కార్యాలయం కౌంటర్‌లో అందజేయాలని కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫారంతోపాటు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పాన్ కార్డు జిరాక్స్ సమర్పించాలని సూచించారు.

గల్ఫ్ మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

- ఎన్‌ఆర్‌ఐ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యుడు స్వదేశ్ పర్కిపండ్ల



మృతుడి వివరాలు అందజేస్తున్న కుటుంబీకులు

నిర్మల్‌ఖిల్లా/సారంగపూర్: ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన సారంగాపూర్ మండలం మలక్ చించోలి గ్రామానికి చెందిన కుర్మే దేవన్న(51)గత గురువారం అక్కడే గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయాన్ని అతను పనిచేసే కంపెనీ యాజమాన్యం కుటుంబ సభ్యులకు తెలిపింది. దేవన్న మృతదేహాన్ని సాధ్యమైనంత త్వరగా స్వస్థలానికి తెప్పించే ఏర్పాట్లు చేస్తామని ఎన్‌ఆర్‌ఐ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యుడు స్వదేశ్ పర్కిపండ్ల తెలిపారు. ఈ మేరకు శనివారం మృతుడి కుటుంబీకులు జిల్లాకేంద్రంలో స్వదేశ్‌ను కలిసి దేవన్న వివరాలు అందించారు. తక్షణమే దుబాయ్ ఎంబసీకి సమాచారమందించి ఇండియాకు మృతదేహం తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులకు ప్రగతిచక్రం అవార్డులు



ఉద్యోగులకు అవార్డు అందిస్తున్న డీఎం హరిప్రసాద్

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో శనివారం ప్రగతిచక్రం అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన పలువురు ఉద్యోగులకు డీఎం హరిప్రసాద్ అవార్డులు అందజేశారు. కండక్టర్లు భూమేశ్, కవిత, ఎల్ఎస్.గౌడ్, డ్రైవర్లు సంజీవ్, రఫీక్‌ఉద్దీన్, మల్లికార్జున్‌తోపాటు మెకానిక్ సెక్షన్‌లో పనిచేసే నర్సయ్య, శివరాజ్, శంకర్, నరేందర్, రవీందర్ అవార్డులు అందుకున్నారు. సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ భగవంత్‌రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఉపాధి' అక్రమాలపై 'వీఎంసీ'



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- ప్రతీనెల మొదటి వారంలో తనిఖీలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

వివరాలు..	
జిల్లాలోని మొత్తం మండలాలు	18
మొత్తం గ్రామపంచాయతీలు	400
జిల్లాలోని మొత్తం జాబ్ కార్డులు	1.77 లక్షలు
కూలీల సంఖ్య	3.33 లక్షలు
యాక్టివ్ జాబ్ కార్డులు	1.30 లక్షలు
యాక్టివ్ కూలీల సంఖ్య	2.28 లక్షలు

నిర్మల్‌చైన్‌గేట్: ఉపాధి హామీ పథకం అమలులో పారదర్శకత కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిఘా వ్యవస్థను ప్రవేశపెడుతోంది. గ్రామస్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల (వీఎంసీ) ఏర్పాటుతో అక్రమాలు, నిధుల దుర్వినియోగం, గోస్ట్ వర్కర్లను అరికట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. డిజిటల్ ట్రాకింగ్, రియల్–టైమ్ రిపోర్టింగ్ ద్వారా పథకం బలోపేతం కానుంది.

వీఎంసీల ఏర్పాటు విధానం

ప్రతీ గ్రామ పంచాయతీలో ఐదుగురు సభ్యులతో వీఎంసీలు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలతోపాటు సగం మంది మహిళలు ఉండేలా కమిటీలను రూపొందిస్తున్నారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘ సభ్యులు, సివిల్ క్లబ్ సభ్యులు ఈ కమిటీల్లో ఉంటారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు కమిటీలను ప్రతిపాదించి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా కలెక్టర్‌కు, తద్వారా రాష్ట్ర అధికారులకు నివేదికలు పంపుతారు. ఈ కమిటీలు ఆరు నెలలపాటు పనిచేస్తాయి. జిల్లాలో 396 గ్రామ పంచాయతీలు, 1.77 లక్షల జాబ్ కార్డులు, 3.33 లక్షల కూలీలు ఉన్నారు, వీరిలో 1.30 లక్షల జాబ్ కార్డులు, 2.28 లక్షల కూలీలు యాక్టివ్‌గా ఉన్నారు.

కమిటీల పర్యవేక్షణ విధులు

వీఎంసీలు వారానికి ఒకసారి పనులను పరిశీలిస్తాయి. ప్రతి నెల మూడో శుక్రవారం కూలీలు, సిబ్బందితో సమావేశమై పనుల నాణ్యత, వ్యయం, రికార్డులను తనిఖీ చేస్తాయి. సోషల్ ఆడిట్ సమయంలో నివేదికలు సమర్పించి, అధికారులు చర్యలు తీసుకునేలా చేస్తాయి. ఈ వ్యవస్థతో పథకం మరింత పారదర్శకంగా అమలవుతుందని అధికారులు ఆశిస్తున్నారు.

వీఎంసీలు ఏర్పాటు చేస్తున్నాం..



గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనుల పారదర్శకత కోసం విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ (వీఎంసీ)లను ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు సంబంధించిన సర్క్యులర్‌ను పంచాయతీ కార్యదర్శులకు అందజేశాం. నిబంధనల మేరకు వారు కమిటీలో సభ్యులను ఎంపిక చేసి ఒకటి రెండు రోజుల్లో నివేదిక అందజేస్తారు. కమిటీలను కలెక్టర్‌కు నివేదిస్తాం. రాష్ట్ర అధికారులు ఆమోదం తెలిపిన తర్వాత వీఎంసీలు పూర్తిస్థాయిలో పనిచేస్తాయి.

– రాధ, ఎంపీడీవో, లక్ష్మణచాంద

క్లుప్తంగా

హన్‌మాన్ ఆలయంలో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తాంసి బస్టాండ్ సమీపంలో గల గంజ్‌రోడ్ మర్వాడి హనుమాన్ ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ నిర్వాహకుడు సుమిత్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఆలయకర్త రాజు పూజ కోసం ఆలయానికి వచ్చాడు. అప్పటికే తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. హనుమాన్ విగ్రహానికి ఆలంకరించిన కండ్లు, గద, ముఖం తోపాటు పార్వతిదేవి విగ్రహా కిరీటం, అదే విధంగా గణేశ్ విగ్రహానికి ఉన్న కిరీటాలు కనిపించలేదు. దీనిపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సిబ్బంది డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.40 వేల వరకు ఉంటుందని తెలిపారు. కాగా చోరీకి పాల్పడిన నిందితుడిని రాత్రి అరెస్ట్ చేశారు. భీంపూర్ మండలంలోని నిపానికి చెందిన ఆత్రం దయానంద్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి 8 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాశ్ తెలిపారు.

స్క్రాప్ షాపులపై ఆకస్మిక దాడులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని స్క్రాప్ దుకాణాలపై పోలీసులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆదిలాబాద్ వన్‌టౌన్, టూటౌన్, మావల, బేల, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, నార్నూర్, బోథ్ వంటి పది మండలాల్లో 35 ప్రత్యేక బృందాలు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించాయి. 13 స్క్రాప్ దుకాణాల వద్ద పలు వస్తువులు లభ్యమైనట్లుగా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. లభ్యమైన షాపులపై ఆయా స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దొంగలించిన సరుకు, వస్తువులను వాహనాలను, రాగి లోహాలను కొన్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్‌టౌన్ పరిధిలోని రఫీక్, పంజేషా కాలనీలోని ఇస్సాక్, హమీద్‌పూర లోని రియాజ్, సయ్యద్ బాబు, మహమ్మద్ ఫాజిల్, గోరే, ఆఫ్రాజ్ బటియా, కరణ్, ముజ్జు, షబ్బీర్ ఖాన్, సత్పురే ప్రమోద్, షేక్ యునూస్, మహ్మద్ ఫయాజ్ షాపుల్లో పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఫెన్సింగ్ వైర్ బండిళ్లు, రాగి, గ్యాస్ సిలిండర్లు, సబ్ మెర్సిబుల్ మోటార్లు, కరెంట్ సర్వీస్ వైర్, బైక్ ఇంజిన్లు, అల్యూమినీయం బ్యాగ్, ఆటో, ఆటో ఇంజిన్, ఇన్వర్టర్లు, పెద్ద బ్యాటరీలు, బైక్‌లు, హెచ్‌పీ మోటార్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో వ్యాపారి

మందమర్రిరూరల్: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఓ వ్యాపారి మోసపోయాడు. ఈ ఘటన మందమర్రిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం .. మందమర్రి మార్కెట్ ఏరియాకు చెందిన ట్రేడర్స్ వ్యాపారికి గుర్తుతెలియని వ్యక్తులు గతనెల 7న ఫోన్ చేసి, 8న తమకు 25 రేకుల డబ్బులు పంపుతామని వాట్సాప్ ద్వారా స్కానర్ పంపించారు. దానికి సదరు వ్యాపారిని ఒక రూపాయి పంపించాలని సూచించారు. వ్యాపారి రూపాయి పంపడంతో రెండు రూపాయలు వచ్చాయి. మీకు రేకుల డబ్బులు మొత్తం ఇలాగే వస్తాయని, ఇది ఆర్మీ మిషన్ అని ఆర్మీ వాళ్ల ద్వారా డబ్బులు వస్తాయని నమ్మబలికారు. రెండు, మూడు లింకులు పంపి వాటిని ఓపెన్ చేయమన్నారు. ట్రేడర్ వ్యాపారి లింక్‌లు ఓపెన్ చేసినా ఎలాంటి డబ్బులు రాకపోగా తన అకౌంట్ నుంచి రూ.96,482 డబ్బులు పోయినట్లు మెసెజ్ రావడంతో మోసపోయానని గ్రహించాడు. వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అమ్మా వందనం..



- దేశ సేవకు పిల్లలను పంపిన మాతృమూర్తులు ఎందరో..
- నేడు మదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

తల్లులకు పిల్లలన్నా.. ఇల్లన్నా ఎంతో ప్రేమ. ఆ తల్లుల ప్రేమ ఇల్లు, పిల్లలకే పరిమితం కాలేదు. దేశాన్నీ ప్రేమించారు. మాతృభూమిపై మమకారంతో దేశ సేవ కోసం పిల్లలకు ఉగ్గుపాల నుంచే దేశభక్తిని నూరిపోశారు. నేడు ఎంతోమంది సైనికులు సరిహద్దులో దేశ సేవ చేస్తున్నారంటే ఆ మాతృమూర్తులే కారణం. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్న సైనికుల విజయం వెనుక ఉన్నది ఆ తల్లులే. దేశానికి ఎంతోమంది వీర సైనికులను అందించిన తల్లులపై నేడు మదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

పట్టుదలకు ప్రోత్సాహం



శ్యామల

బెల్లంపల్లి: తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌కు చెందిన ఎనగంటి శ్యామలకు దేశమన్నా.. దేశభక్తి అన్నా ఎనలేని అభిమానం. అణువణువునా మాతృదేశంపై మమకారం పెంచుకుంది. ఎనగంటి శ్యామల, సమ్మిరెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. సమ్మిరెడ్డి సింగరేణి కంపెనీలో కార్మికుడిగా పని చేసేవారు. పిల్లలు చిన్నతనంలో ఉండగానే 1988లో అకాల మరణం చెందారు. దీంతో కుటుంబ బాధ్యతలు శ్యామలపై పడ్డాయి. భర్త వారసత్వంగా వచ్చిన సింగరేణి ఉద్యోగం చేస్తూ ముగ్గురు పిల్లలను పెంచి పెద్ద చేసింది. చిన్న కుమారుడు రాజశేఖర్ డిగ్రీ చదువుతూనే 2006లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం సాధించాడు. తల్లి ఆశించినట్లుగానే దేశ రక్షణలో విధులు నిర్వర్తిస్తున్నాడు. రాజశేఖర్ పెద్దనాన్న కుమారులు ఒకరు ఇండియన్ ఎయిర్ ఫోర్స్, మరొకరు నేవీలో పని చేసేవారు. వారి స్ఫూర్తితో మూడో ప్రయత్నంలో ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం సాధించి తల్లి కలను సాకారం చేశాడు. ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రంలో సార్జెంట్ హోదాలో విధులు నిర్వర్తిస్తున్నాడు. దేశ సేవ చేయాలనే పట్టుదల కుమారుడికి ఉండడంతో ప్రోత్సహించింది. రెండు సార్లు విఫలమైనా వెన్నుతట్టి అండగా నిలబడడంతో నేడు దేశ సేవలో ముందున్నాడు.

గత 15 ఏళ్లుగా విధులు



కస్తూరి లక్ష్మి

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కస్తూరి శ్రీనివాస్ గత 15 ఏళ్లుగా ఆర్మీలో పనిచేస్తున్నాడు. ఈయన తల్లి కస్తూరి.. కుమారుడు సైనికుడిగా దేశానికి సేవలందించాలని కోరుకుంది. అనుకున్నట్టుగా ఆర్మీలో ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం యుద్ధ వాతావరణ సమయంలో దేశాన్ని రక్షిస్తున్నందుకు గర్వపడుతున్నా.

సంతోషంగా ఉంది



కమల

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన రాజేశ్వర్ ఆర్మీలో ఢిల్లీలో పనిచేయడం ఆనందంగా ఉంది. పాక్‌తో జరుగతున్న యుద్ధం సమయంలో పనిచేయడం గర్వంగా ఉంది. దేశం కోసం కుమారుడిని ఆర్మీలో చేర్పించడం ఆనందంగా ఉంది.

కుటుంబం కన్నా దేశం ముఖ్యం



వేముల లక్ష్మి

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన వేముల లక్ష్మి కుమారుడు నరేశ్ ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నాడు. తనకు కుటుంబం కన్నా దేశమే ముఖ్యం. దేశం కోసం తన కుమారుడు శత్రుదేశంతో పోరాటం చేయడం తల్లిగా గర్వంగా ఉంది.

దేశసేవలో గర్విస్తున్నా



ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: నా పేరు రేండ్ల కళావతి. నాది మావల మండల కేంద్రం. మా ఆయన భూమన్న. మాది వ్యవసాయ కుటుంబం. నాకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు వ్యవసాయం చేస్తుండగా ఇద్దరు కుమారులు రేండ్ల మహేశ్ (యూపీ), రేండ్ల నగేశ్ (బళ్లారి)లో ఇద్దరు ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. దేశం కోసం ఇద్దరు కుమారులు సేవ చేయడం నాకు ఎంతో గర్వంగా ఉంది.

ఆనందంగా ఉంది



నా పేరు రొడ్డ గంగమ్మ. నాది మావల. నాకు ముగ్గురు కుమారులు గంగన్న, ప్రదీప్, నవీన్. భర్త కర్రెన్న పిల్లల చిన్నతనంలోనే మరణించాడు. కూలీ నాలీ చేసి వారిని పెంచాను. చిన్న కుమారుడు ఉదంపూర్ ఆర్మీ బేస్ క్యాంపులో విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల సెలవులపై ఇంటికి రాగా ఆదివారం తిరిగి పయనమవుతున్నాడు.

ధైర్యంగా పోరాటం చేస్తుండు



నా పేరు నందనవేణి గంగమ్మ. మాది మావల. మా ఆయన రాములు. పిల్లలు చిన్నతనంలో మృతిచెందాడు. ముగ్గురు ఆడపిల్లలు రాజమణి, విజయ, శ్రీవాణి ఉన్నారు. కుమారుడు సత్యనారాయణ పంజాబ్ లోని ఫిరోజ్‌పూర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. కుమారుడు దేశ ప్రజల భద్రత కోసం వీరోచితంగా పోరాడటం నాకు చాలా గర్వంగా ఉంది.

సరిహద్దులో రక్షణ



ఇచ్చోడ: నా పేరు ముండే లోభ బాయి. మాది ఇచ్చోడ మండలంలోని నర్సాపూర్. నా ఇద్దరు కుమారులు మాధవ్ (బీఎస్ఎఫ్), ధనరాజ్ (ఆర్మీ)లో ఐదేళ్లుగా పనిచేస్తున్నారు. దేశ సరిహద్దులో రక్షణగా ఉన్నారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో విజయం కోసం కృషిచేస్తారు.

గర్వపడుతున్నా



దస్తురాబాద్: మండలంలోని దేవెనిగూడెం గ్రామానికి చెందిన అల్లటి ఎల్లవ్వ–రాజన్న దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాజేష్, చిన్న కుమారుడు మిలిటరీలో ఉద్యోగాలు చేస్తున్నారు. దేశ సరిహద్దులో రక్షణగా ఉంటున్న ఇద్దరు కుమారులను చూసి గర్వంగా ఉంది.

పహారా కాస్తున్నాడు



లక్ష్మి

లక్ష్మణచాంద: లక్ష్మణచాందకు చెందిన నెర్దన్‌పెల్లి లక్ష్మి కొడుకు నరేశ్ 8 ఏళ్లుగా దేశ సైనికుడిగా పనిచేస్తున్నాడు. దేశం కోసం పహారా కాస్తూ రక్షిస్తున్నందుకు తల్లిగా ఎంతో గర్విస్తున్నా.

భయం లేదు



సంధ్య

లక్ష్మణచాంద: ధర్మారం గ్రామానికి చెందిన అశ్వంత్ కుమార్ రెండేళ్ల క్రితం అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. జమ్మూలో విధులు నిర్వహిస్తున్నాడు. కుమారుడు దేశం కోసం పోరాటం చేయడంపై తనకు భయం లేదు.

ఆర్మీలోకి పంపించాను



ఇచ్చోడ: నా పేరు శివనంద. మాది ఇచ్చోడ మండలంలోని నర్సాపూర్. నా ఇద్దరు పిల్లలు అనిల్, ఉత్తం దేశ సేవ కోసం ఆర్మీలోకి పంపించాను. పదేళ్లుగా కశ్మీర్‌తోపాటు దేశ సరిహద్దులో పనిచేశారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో ఇద్దరు కుమారులు పాల్గొనడం గర్వంగా భావిస్తున్నా.

వైకల్యం ఉన్నా పిల్లలకు సపర్యలు



ఇద్దరు పిల్లలకు అన్నం తినిపిస్తున్న తల్లి బత్తిబాయి

ఇంద్రవెల్లి: మండలంలోని తుమ్మగూడ పంచాయతీ పరిధి గోపాల్ సింగ్‌తండాకు చెందిన అంతర్వేది చంద సింగ్, బత్తిబాయి లది నిరుపేద కుటుంబం. ఈ దంపతులకు ఆరుగురు సంతానం. రేఖ(17), ఆర్థిక(9) పుట్టుకతో వైకల్యంతో జన్మించారు. నాలుగెకరాల్లో తండ్రి వ్యవసాయ పనులతోపాటు కూలీ పనిచేస్తున్నాడు. తల్లి ఆ ఇద్దరు కూతుళ్లకు సపర్యలు చేస్తూ చూసుకుంటుంది.

25 ఏళ్లుగా అన్నీ తానై



యమునకు అన్నం తినిపిస్తున్న కాత్లె లలిత

ఇచ్చోడ: 25 ఏళ్లుగా కూతరుకు అన్నీతానై వ్యవహరిస్తుంది ఆదివాసీ మహిళ కాత్లే లలిత. దూబార్‌పేట్‌కు చెందిన లలిత, దత్తు కూలీ పనిచేస్తూ జీవిస్తున్నారు. వీరి సంతానం ఇద్దరు పిల్లలు. కుమార్తె యమున పెరుగుతున్న క్రమంలో కాళ్లు చేతులు చచ్చుబడ్డాయి. మాటలు రాలేదు. తెలిసిన చోట్ల వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. 25 ఏళ్లుగా మంచం, ట్రైసైకిల్‌కే పరిమితమైంది. ఆమెకు తల్లి సపర్యలు చేస్తోంది.

ఆర్మీ జవాన్ కావాలని..



తాంసి: నా పేరు దాసరి సువర్ణ. మాది పొన్నారి గ్రామం. మా చిన్న కుమారుడు నవీన్ చిన్నప్పటి నుంచే ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం సాధించాలని కలలు కనేవాడు. సాకారం చేసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం అనారోగ్యం బారినపడ్డాడు. దేశ సేవ కోసం విధులు నిర్వహిస్తుండగానే మృతి చెందాడు. కుమారుడు బతికి ఉండగా దేశ సేవలో ఉన్నాడని మా కుటుంబానికి గర్వకారణంగా ఉండేది. ప్రస్తుతం కుమారుడి జ్ఞాపకార్థం గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశాను.

అన్నీతానై..



విజయ

కుంటాల: కుంటాలకు చెందిన పెద్దోల్ల విజయ అన్నీతానై.. తన పిల్లలను పెంచి పెద్ద చేసింది. భర్త లింగయ్య పిల్లలు రెండేళ్ల వయసు ఉన్నప్పుడే మృతి చెందాడు. కాయ కష్టంచేసి పిల్లలను చదివించింది. పెద్ద కుమారుడు అనిల్ కుమార్ నేవీకి, చిన్న కుమారుడు సుధీర్ కుమార్ స్పీచ్ థెరపీగా పనిచేస్తున్నాడు. పిల్లలను ప్రయోజకుల్ని చేసిన విజయ పలువురికి ఆదర్శంగా నిలిచింది.

ఆర్మీలో పనిచేయాలని కోరిక



ఎర్ర అంకు

కాసిపేట: దేవాపూర్‌కు చెందిన ఎర్ర అంకుకు ఇద్దరు కుమార్తెలు, ఒక్క కుమారుడు. కుమారుడు శ్రీనివాస్ దేశ భక్తితో 16 ఏళ్లుగా ఆర్మీలో పనిచేస్తున్నారు. చిన్ననాటి నుంచి ఆర్మీలో పనిచేయాలని కోరిక మేరకు పంపించాను. దేశ సేవలో ఉన్నందున గర్వంగా ఉంది.

అదృష్టంగా భావిస్తున్నా



బోథ్: నా పేరు కదం అనసూయ. నాకు ఐదుగురు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు ఆర్మీలో విధులు నిర్వహిస్తారు. రెండవ కుమారుడు ప్రవీణ్ కుమార్, మూడవ కుమారుడు ప్రతాప్‌లు ఆర్మీలో పనిచేస్తున్నారు. నా ఇద్దరు కుమారులు ఆర్మీలో విధులు నిర్వహించడం ఆనందంగా ఉంది. అదృష్టంగా భావిస్తున్నా.

సంతోషంగా ఉంది.



బోథ్: నాపేరు తక్కల స్వరూప. నాకు కుమారుడు, కూతురు ఉన్నారు. భర్త మృతిచెందిన కొంతకాలానికి కుమారుడు శైలన్ రెడ్డికి ఆర్మీలో ఉద్యోగం వచ్చింది. ఆర్మీలో విధులు నిర్వహించడం ఆనందంగా ఉంది. దేశం కోసం పోరాడే అవకాశం రావడం సంతోషంగా ఉంది.

నా కల నెరవేర్చాడు



తానూరు: భోసికి చెందిన బాయి లక్ష్మి బాయి–భూమన్న దంపతుల కుమారుడు సాయినాథ్. 2004లో ఆర్మీలో ఉద్యోగం సాధించి విరమణ పొందాడు. తల్లి ఆశయం నెరవేర్చేందుకు 2024లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై నిజామాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. తల్లి కల నేరవేర్చడంతో తల్లి సంతోషం వ్యక్తం చేస్తోంది.

– లక్ష్మిబాయి

తండ్రిని రోకలితో కొట్టి చంపిన తనయుడు

- నిర్మల్ జిల్లా రాజూరలో ఘటన

లోకేశ్వరం: తండ్రిని రోకలితో కొట్టి తనయుడు చంపాడు. నిర్మల్ జిల్లా మండలంలోని రాజూర గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ముథోల్ సీఐ మల్లేశ్ కథనం ప్రకారం.. రాజూర గ్రామానికి చెందిన గన్నారం భూమన్న(80)కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు భూమన్న, రెండో కుమారుడు సుదర్శన్, మూడో కుమారుడు సాయికృష్ణ. సుదర్శన్ మూడేళ్ల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు చేసుకున్నాడు. సాయి కృష్ణ హైదరాబాద్‌లో పనిచేస్తూ జీవిస్తున్నాడు. పెద్దకుమారుడు భూమన్న భార్య సునీతకు ఏడాది క్రితం గొడవల కారణంగా పుట్టింటికి నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌కు వెళ్లిపోయింది. రాజురాలో తనకున్న మూడెకరాల్లో పెద్దకుమారుడు వ్యవసాయంతోపాటు కూలీ పని వెళ్లి తండ్రి భూమన్నకు పోషించుకుంటున్నాడు. ఇద్దరు ఇంట్లో ఉంటున్నారు. మూడు రోజులుగా తిండి పెట్టటం లేదని తండ్రి, పెద్దకుమారుడి మధ్య గొడవ జరిగింది. శనివారం తెల్లవారుజామున ఇద్దరు గొడవపడ్డారు. క్షణికావేశానికి లోనైన కుమారుడు రోకలితో తండ్రి తలపై కొట్టి హత్య చేశాడు. మృతుడి కుమార్తె సుజాత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అంతకుముందు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ముథోల్ సీఐ మల్లేశ్, లోకేశ్వరం ఎస్సై అశోక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కేసుపై విచారణ జరిపి నిందితుడిపై చర్యలు తీసుకుంటామన్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మల్లేశ్



గన్నారం భూమన్న మృతదేహం

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

లోకేశ్వరం: ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి మహిళ మృతి చెందింది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. కుంటాల మండలం కల్లూర్ గ్రామానికి చెందిన పసుల సాయన్న- పసుల గోదావరి (40) దంపతులు. వీరు ఈనెల 6న బావమరిది కూతురు పెళ్లికి మండలంలోని పిప్రి గ్రామానికి బైక్‌పై వచ్చారు. పెళ్లి ముగించుకుని శనివారం బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. మండలంలోని హవర్గ సమీపంలోని శ్మశానవాటిక వద్ద బైక్‌పై నుంచి కళ్లు తిరిగి గోదావరి కింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలు గోదావరి తమ్ముడు దాస శేఖర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



గోదావరి మృతదేహం

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: మైనర్లకు వాహనాలను ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. తన కార్యాలయంలో శనివారం డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్ రూరల్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు మైనర్లకు వాహనాలు ఇచ్చిన తండ్రులపై వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 17 ఏళ్ల మైనర్ బాలుడికి బైక్ ఇచ్చిన తండ్రి వేణుగోపాల్‌పై టూటౌన్‌లో, 12 ఏళ్ల బాలుడికి బైక్ ఇచ్చిన తండ్రి నర్సయ్యపై ఆదిలాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నర్సయ్య కుమారుడు బైక్‌ను పాచ్చర వద్ద స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి సేవించిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: గంజాయి సేవించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల శివారు ప్రాంతంలో ఆదిలాబాద్‌లోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన షేక్ జాహిర్, రవీంద్రనగర్‌కు చెందిన బాన్సోడే సంతోష్‌లు శనివారం మత్తు సేవించినట్లు అనుమానం కలిగింది. వారికి గంజాయి టెస్టు చేయగా పాజిటివ్ నిర్ధారణ అయింది. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కిరాణా షాపు యజమానిపై..

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని గోదావరి రోడ్‌కు చెందిన కిరాణా షాపు యజమాని శ్రీనివాస్‌పై కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ అమ్ముతున్నాడని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. శనివారం మంచిర్యాల నుంచి ఫుడ్ సేఫ్టీ అధికారులు నరేశ్, అంజిత్.. కిరాణా షాపులో తనిఖీలు నిర్వహించి కూల్‌డ్రింక్ బాటిల్స్, ఇతర పది రకాల వస్తువులను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. వాటిని శ్యాంపుల్స్‌ను ల్యాబ్‌కు పంపించామన్నారు.

లైంగికవేధింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఓ మహిళ పేరిట సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన ఓ మహిళ బంధువులు పంజాబ్‌లో నివసిస్తున్నారు. కొన్ని అవసరాల నిమిత్తం అమృత్‌సర్‌కు చెందిన అసిస్టెంట్ ట్రెజరర్ మునీష్ కుమార్‌ను వీరు సంప్రదించారు. సదరు అధికారి డబ్బులు ఆశించాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో పనులు చేసేందుకు నిరాకరించాడు. దీంతో అతన్ని మహిళ తరపు బంధువులు విజిలెన్స్ అధికారులకు పట్టించారు. వారిపై కక్ష పెంచుకున్న మునీష్ కుమార్ ఆదిలాబాద్‌కు చెందిన మహిళ పేరిట పేస్‌బుక్‌లో ఫేక్ ఐడీని క్రియేట్ చేసి, సదరు మహిళ ఫొటోలను మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆదిలాబాద్ సైబర్ క్రైమ్ బృందం సహకారంతో, వన్‌టౌన్ పోలీసులు నిందితుడిని గుర్తించి అమృత్‌సర్ నుంచి ఆదిలాబాద్‌కు తీసుకువచ్చారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సునీల్ కుమార్

ఎడారి దేశంలో జిల్లావాసి జైలు జీవితం

- చేయని నేరానికి గల్ఫ్ బాధితుడి నరకయాతన
- న్యాయ సహాయం కోసం కుటుంబసభ్యుల వేడుకోలు

నిర్మల్‌ఖిల్లా: చేయని నేరానికి అకారణంగా ఎడారి దేశంలో జైలుశిక్ష అనుభవిస్తున్న తమ కుటుంబ సభ్యుడికి న్యాయ సహాయం అందించాలని గల్ఫ్ బాధిత కుటుంబ సభ్యులు కోరారు. జిల్లా కేంద్రంలో శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ స్వదేశ్ పర్కిపండ్లతో కలిసి కలిసి వివరాలు వెల్లడించారు. కుంటాల మండలం అంబకంటి గ్రామానికి చెందిన గజకరెడ్ల సాయన్న (51) ఉపాధి నిమిత్తం గతేడాది దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఏప్రిల్ 16న స్థానిక పోలీసులు అరెస్టు చేసి అబుదాబీ జైలుకు తరలించారు. సమాచారం తెలిసిన కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై ఎవరిని సంప్రదించాలని తెలియని దిక్కుతోచని పరిస్థితుల్లో ఎన్ఆర్ఐ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యుడు స్వదేశ్ పరికిపండ్లను కలిసి సమస్యను వివరించారు. నిరక్షరాస్యత కారణంగా తన పేరిట ఇతరులకు తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించకపోవడంతో అక్కడి పోలీసులు అరెస్టు చేసి జైలులో వేసినట్లు కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. స్వదేశ్ మాట్లాడుతూ బాధితుడి సమగ్ర వివరాలతో అక్కడి ఎంబసీకి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామన్నారు. న్యాయసహాయం ద్వారా జైలు నుంచి విడిపించే ప్రయత్నం చేస్తామని కుటుంబసభ్యులకు భరోసానిచ్చారు. బాధితుడి తల్లి భోజవ్వ, భార్య మంజుల, కుమారుడు సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కుటుంబసభ్యులు

ఉపాధి కూలీకి తేలు కాటు

నెన్నెల: మండలంలోని గంగారాం శివారులో శనివారం ఉపాధి పనులు చేస్తున్న మహిళా కూలీ తేలుకాటుకు గురైంది. పైడిపల్లి నర్మద అటవీ సమీపంలో ఉపాధి పనులు చేస్తుండగా నల్లతేలు కుట్టింది. వెంటనే తోటి కూలీలు ఆమెను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని కూలీలు తెలిపారు.